# ఆకాశమంత పందిరి

కశింకోట ప్రభాకరదేవ్

ఉత్తరంలోని ప్రతి అక్షరం., తనను వెక్కిరిస్తున్నట్లుగా తోచింది లలితకు. బాధగా నిస్సహాయంగా నవ్వుకుంది.

పద్మ ఎంత చక్కగా, సూటిగా వ్రాసింది! తనకన్నా వయస్సులో బాగా చిన్నదయినా అది తనకన్నా తెలివయినది. దానికి ధైర్యంవుంది. తెగింపు వుంది. తనకు ఆ రెండూలేవు. అందుచేతనే ముప్ఫయ్యేళ్ళు వస్తున్నా మ్రోడులాగ మిగిలిపోయింది.

చెంపలమీదుగా జారుతున్న కన్నీటిని తుడుచుకుంది లలిత. ఇంట్లో భరించలేనంతగా నిశ్శబ్దం! లలిత తల్లి జానకమ్మ సర్వంకోల్పోయిన మనిషిలాగ రాటకు జారగిలబడి కూర్చునుంది.

లలిత తల్లివేపొకసారి చూసి, భారంగా నిట్టూర్చి తనగదిలోకి నడిచింది. మంచంమీద కూలబడి మరోసారి వుత్తరాన్ని చదవసాగింది.

అక్కయ్యకు,

నేను రజాక్‌తో వెళ్ళిపోతున్నాను. త్వరలోనే మేమిద్దరం రిజిస్టర్ మేరేజ్ చేసుకుంటాము. ఈ విషయం నీకు కోపం కలిగిస్తుందని తెలిసినా, పరిస్థితుల్ని నువ్వు జాగ్రత్తగా గ్రహించి, నన్ను క్షమించగలవని ఆశిస్తూయున్నాను. మాకోసం నువ్వెంత కష్టపడుతున్నావో తెలుసు. నీ కష్టంతో మా కడుపు నింపగలవేగాని కోరికలనేం తీర్చగలవు? అందుకనే, వెళ్ళిపోతున్నాను. నాపెళ్ళి బాధ్యత నీకు తప్పుతుంది. ఈ విధంగానయినా నీ బరువును కాస్తంత తగ్గించ గలిగినందుకు ఆనందిస్తున్నాను.

ఇట్లు
నీ చెల్లెలు
పద్మ.

'ఎంత నేర్పుగా వ్రాసింది! తెలివిగా నా చేతకానితనాన్ని ఎత్తి చూపింది' నిట్టూర్చింది లలిత.

అవును పద్మ మాటలు నిజమే. తను తెచ్చిన జీతంతో వాళ్ళకోరికలు యెలాగ తీరుతాయి? తీరుతాయని ఎవరూ అనుకోలేదు. అందుచేతనే, కోరికలు తీరేమార్గం, తీర్చుకునే అవకాశం లభించింది కనుక పద్మ వెళ్ళిపోయింది. అదృష్టవంతురాలు!

ఒకే కడుపున పుట్టిన తామిద్దరిలో యెంత వ్యత్యాసం! చేతికిక్కిన అవకాశాన్ని జారవిడుచుకున్న దౌర్భాగ్యురాలు తను. ఆనాడు సుధాకర్ మాటలు మన్నించివుంటే తనకు ఈనాడు యింతటి క్షోభవుండేది కాదు.

పది సంవత్సరాల క్రితం....

సుధాకర్ తనకోసం, తన అంగీకారం కోసం ఎంత ప్రాధేయపడ్డాడు! ఎంతగా నచ్చచెప్పాడు.

"లలితా! నామాట విను. మనం వివాహం చేసుకుందాం. మీ అమ్మ, చెల్లెలు, తమ్ముడు, మనతోనే వుంటారు. ఈ విషయంలో నువ్వు లేనిపోని అనుమానాలు పెట్టుకోవద్దు. నీబాధ్యతలకు నేను అడ్డురాను" అన్నాడు.

కాని తను వినలేదు. బాధ్యత కోరికకు

కళ్ళెం వేసింది. సుధాకర్ యెంతచెప్పినా ప్రయోజనం లేకపోయింది.

కాలం ఎవరి కోసమూ ఆగదు.

సుధాకర్‌కు మరోవూరు బదిలీ అయింది. అతడు దూరమయినా, మానసికంగా తనకు మరింత దగ్గరయ్యాడు.

ఒకటి....రెండుకాదు. పది సంవత్సరాలు గడిచాయి. తండ్రి చనిపోతూ తనమీదవుంచిన బరువు బాధ్యతలను యింతవరకూ సక్రమంగానే నిర్వర్తించింది.

చివరకు తనకు మిగిలిందేమిటి?

సాధించింది పిడికెడంత, పోగొట్టుకుంది కొండంత. ఇదీ తన బ్రతుకు.

పిచ్చిగా నవ్వుకుంది లలిత. ఆ నవ్వులో కాంతిలేదు.

ముప్ఫయ్యేళ్ళు! అంటే మూడు పదులు!
ముప్ఫయి వసంతాలు!!

ఇన్ని వసంతాలు గడిచినా తన బ్రతుకులో ఒక్క వ సం త ం కూ డా తొంగిచూడలేదు. స్పందనలేదు. చైతన్యంలేదు. కుటుంబ అవసరాలను తీర్చేయంత్రం తను. అంతే.

మంచం మీదనుండి నీరసంగా లేచి అద్దం దగ్గరకు నడిచింది లలిత. నుదుటిమీది అస్తవ్యస్తంగా పడివున్న జుత్తును సవరించుకుంది. అద్దంలో తనప్రతిబింబాన్ని చూసుకొనివులిక్కిపడింది. ఇదివరకు ఎన్నోసార్లు అద్దంలో తన ప్రతిబింబాన్ని చూసుకున్నా, అప్పుడెప్పుడూ లలిత యిలాగ వులిక్కిపడలేదు. ఆందోళన చెందలేదు.

కళ్ళు చిట్లించుకొంటూ అద్దంలోకి పరీక్షగా చూసింది.

సందేహంలేదు.

తన రూపంలో మార్పు స్పష్టంగా,కొట్టొచ్చినట్లుగా కనబడుతుంది. గులాబిరంగులోవుండే చెక్కిళ్ళు తెల్లగా పాలిపోయినట్లుగా వున్నాయి. కళ్ళకింద నల్లటి చారలు!

ఒకప్పుడు ఎంత అందంగా వుండేది తను! తన కళ్ళలోకి చూస్తూ సుధాకర్ పరవశించిపోయేవాడు. తన చెక్కిళ్ళు గులాబీ మొగ్గలనేవాడు. అధరాలు అరవిందాలంటూ కవిత్వం ఒలకబోసేవాడు.

ఒకనాడు....

అమ్మా నాన్నలతో కలసి దగ్గర బంధువుల ఇంట్లో పెళ్ళికి వెళ్ళింది. సుధాకర్ కూడా వచ్చేడు.

పెళ్ళి పందిరంతా కోలాహలంగా వుంది. మంగళ వాద్యాలు మ్రోగుతున్నాయి. పందిరి రాటకు ఆనుకుని పురోహితుడు జరిపిస్తున్న పెళ్ళి తంతును తిలకిస్తోంది తను.

"అంత దీక్షగా చూస్తున్నావ్. పెళ్ళిమీదకు గాలి మళ్ళిందేమిటి?" అన్నాడు నవ్వుతూ సుధాకర్.

తను సిగ్గు పడింది.

"కొద్ది రోజులు ఓపికపట్టు. జాబ్ దొరకగానే, ఆకాశమంత పందిరిలో నీ మెడలో మూడు ముళ్ళు వేసేస్తాను.'' అన్నాడు.

ఆ మాటలు తన హృదయ వీణా తంత్రులను సుతారంగా మీటేయి. ఇంతలో, పందిట్లో లైట్లు ఆరిపోయాయి. ఒక్కసారిగా, అంతటా చీకటి వ్యాపించింది. తను భయంతో సుధాకర్ చెయ్యిని గట్టిగా పట్టుకుంది. ఆ అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నాడు సుధాకర్. బలంగా తనను దగ్గరకు లాక్కొని ముద్దుపెట్టుకున్నాడు.

గతంలోనుండి బైటపడింది లలిత.

నిప్పులు చెరిగే ఎండలో నడుస్తున్న బాటసారికి శీతల పానీయం దొరికినట్లుగా అనుభూతి చెందింది లలిత. మధురస్మృతికి చిహ్నంగా పెదవులు చిన్నగా కంపించాయి.

కేవలం గతకాలపు మధురస్మృతుల ఆధారంగా జీవించడం దుర్భరంగా వుంటుంది.

బరువుగా నిట్టూర్చింది లలిత.

ఆలోచనలు పద్మవైపు పరుగులు తీశాయి.

పద్మ చాలా అదృష్టవంతురాలు! దాని పెళ్ళి చెయ్యలేని అశక్తురాలిని నేనని గ్రహించి వెళ్ళిపోయింది. కాని, దానికేం తెలుసు? పద్మ పెళ్ళికోసం ప్రతినెలా జీతంలో కొంత భాగం తను బాంక్‌లో వేస్తుంది. చెల్లెలి భవిష్యత్తును

అందంగా తీర్చిదిద్దాలని కలలు కంది. అవన్నీ, గాలి మేడలయ్యాయి. తన అవసరం దానికి అక్కరలేదు. రెక్కలు వచ్చిన పక్షిలాగ ఎగిరి పోయింది.

పద్మ వెళ్లిపోయినందుకు తను బాధ చెంద టంలేదు. మనసుకు నచ్చిన వాడితో పెళ్ళి చేసుకోవాలని వెళ్ళిపోయింది. సంతోషమే. కాని, వెళ్ళిపోతూ అది అన్నమాట ముల్లులాగ గుచ్చుకుని మనసును సలుపుతుంది.

నేను దాని పెళ్ళి చెయ్యలేని అశక్తురాలినా? ఆరు సంవత్సరాల పసిదాన్ని పదహారేళ్ళ దానిగా చేశాను. ఆఫీసులో లంచ్ అవర్స్‌లో కాఫీతో కడుపు నింపుకుని దానికి మంచి బట్టలు కొన్నాను. దాని భవిష్యత్తుకోసం నా భవిష్య త్తును నిస్తేజం గావించుకున్నాను.

ఇంతచేసినా ఏం ప్రయోజనం? అవకాశం దొరకగానే వెళ్లిపోయింది. వెళ్ళిపోతూ, నా అసమర్థతను ఎత్తిచూపుతూ వెక్కిరించింది.

ఇక, తన అవసరం ఎవరికి?

రేపు, తమ్ముడు కూడా అంతే.


డిగ్రీరాగానే వాడికి రెక్కల్లో బలం వస్తుంది. వాడి దారి వాడు చూసుకుంటాడు. తను ఒంటరి దయిపోతుంది. ఏకాకిగా మిగిలిపోతుంది.

దుఃఖం ముంచుకు వచ్చింది లలితకు.

తలగడలో ముఖం దాచుకుని వెక్కి వెక్కి ఏడ్చింది. కొంతసేపు ఏడ్చేక మనసు కొస్తంత తేలికయినట్లు అనిపించింది.

"రెక్కలు రాగానే ఎగిరిపోయే వాళ్ళ గురించి బాధపడకూడదు. రెక్కలకు బలం యివ్వడంవరకే తన బాధ్యత. ఆ బాధ్యతకోసం తన భవిష్యత్తును పాడుచేసుకోకూడదు." ఈ ఆలోచన రాగానే, ఆనాడు సుధాకర్‌ను దూరం చేసుకోవడం ఎంత అవివేకమైనదో అర్థమయింది లలితకు.

ఇప్పటికైనా మించి పోయింది లేదు. తను త్వరపడాలి. ఒంటరిగా మిగిలి పోకూడదు. సుధాకర్ హృదయ ద్వారాలు తనకోసం యిప్పుడు కూడా తెరిచే వున్నాయి.



పది సంవత్సరాలు గడిచినా సుధాకర్ ప్రేమ చెక్కుచెదరలేదు.

తనకోసం, తన కృపాకటాక్ష వీక్షణల కోసం నిరీక్షిస్తున్నాడు.

పది సంవత్సరాలపాటు తన కోసం నిరీ క్షించిన సుధాకర్ ప్రేమ ఎంతగొప్పది! తనను మరచిపోలేక అతడు అవివాహితుడుగానే వుండి పోయాడు. అటువంటి ప్రేమమూర్తిని బాధ్య తలంటూ ఎంత నొప్పించింది!!

ఇక, ఎంత మాత్రం ఆలస్యం జరగడానికి వీల్లేదు. ఇప్పటికే చాలా జీవితం వ్యర్థంగా గడిచిపోయింది. నెలరోజుల క్రిందట సుధాకర్ తమ వూరికే ట్రాన్స్‌ఫర్ కావడం తన అదృష్టం!

రకరకాల ఆలోచనలతో మగత నిద్రలోకి జారిపోయింది లలిత.

* * *

ఆటో దిగి, ఇంట్లోకి వెళ్ళబోతూ గుమ్మం దగ్గరే ఆగిపోయింది లలిత.

లోపల ఒక స్త్రీ మాట్లాడుతుంది, ఆ మాటల్లో తన పేరు దొర్లడంతో నొసలు చిట్లించింది లలిత.

ఆ 'స్త్రీ' సుధాకర్ తల్లి అని పోల్చుకుంది.

"నువ్వెన్నాళ్ళకు పెళ్ళి చేసుకుంటానని అన్నావు. చాలా సంతోషం బాబూ! కాని, ఆ లలితను మాత్రం....చేసుకో....వద్దు."

"ఎందుకనమ్మా! లలిత అంటే నీకు ఇష్టమేగా?" ఆ కంఠ స్వరం సుధాకర్‌ది.

సుధాకర్ ప్రశ్నకు ఆమె ఏమంటుందోనని ఆతృత చెందింది లలిత.

కొన్ని క్షణాలు భారంగా దొర్లిపోయాయి.

"లలిత అంటే యిష్టం లేదా అమ్మా?"

"ఇష్టం లేకేం బాబూ! లలితను నా కోడలుగా చేసుకోవాలని ఎంతో ఆశపడ్డాను."

"మరి, ఇప్పుడేం జరిగిందని వద్దంటున్నావ్?"

"ఏది జరగకూడదో అదే జరిగింది బాబూ! లలిత చెల్లెలు పద్మ ఎవడో తురకవాడితో లేచిపోయింది. ఇప్పుడు, నువ్వు లలితను పెళ్ళి చేసుకుంటే...ఆ చెడిపోయిన కుటుంబంలో సంబంధం కలుపుకుంటే....నీ చెల్లెళ్ళకు మంచి సంబంధాలు వస్తాయా? ఆలోచించు బాబూ.. " ఇంకా ఏదేదో చెబుతుంది సుధాకర్ తల్లి.

మరింక, అక్కడ నిలబడలేకపోయింది లలిత. గాయపడిన మనసుతో, చెమ్మగిల్లిన కళ్ళతో, తడబడే అడుగులతో వెను తిరిగి వెళ్ళిపోయింది—ఒంటరిగా. □

